క్లుప్తంగా

విద్యార్థులకు సాగుపై అవగాహన



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

గోపాలపట్నం: విద్యార్థులకు పొలాలను పరిచయం చేసే వినూత్న కార్యక్రమాన్ని శనివారం గోపాలపట్నం బాలాజీ స్కూల్‌లో నిర్వహించారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో కాయగూరల మొక్కలు నాటారు. పలు రకాల మొక్కలను విద్యార్థులచే నాటించి వాటి సంరక్షణ విధానాన్ని వివరించారు. రోజువారి మొక్కలకు నీళ్ల పోయడం.. మొక్కలు పెరిగే విధానాన్ని పరిశీలించడం వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. హేమ, పిన్నమనేని శ్రీనివాసరావు, జేడీ ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా ఓటర్ సర్వే



జనతా కాలనీలో సర్వే చేస్తున్న బీఎల్‌ఏలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీలో ఆ ప్రాంత వైఎస్సార్‌సీపీకి చెందిన బీఎల్‌ఏలు ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాలో ఉన్న వారు అక్కడే ఉన్నారా లేదా అన్న దానిపై సర్వే చేశారు. పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు అసలైన ఓటర్లను గుర్తించే కార్యక్రమంలో భాగంగా సర్వే చేపడుతున్నట్లు బీఎల్‌ఏలు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు



లలిత పారాయణ పఠిస్తున్న మహిళలు, చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలోని కృష్ణ మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవిజ్ఞాన మండలి యాదవ్ సంఘం పాలక సభ్యుల ఆధ్వర్యంలో యాదవ సామాజిక వర్గ మహిళలు పాల్గొని కృష్ణుడి ఉత్సవ విగ్రహానికి పాలు, పెరుగులతో అభిషేకాలు చేశారు. అనంతరం లలిత పారాయణం, కార్యక్రమంలో గోవింద నామాలను పఠించారు. యాదవ సంఘం పాలక వర్గ ప్రతినిధులు, సభ్యులు, కుల పెద్దలు, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై స్థానిక ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులకు సీఐ అశోక్‌కుమార్ రహదారి నిబంధనల గురించి వివరించారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. అతివేగం కారణంగానే అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సిగ్నల్ లైట్లను చూసుకుని వాహనాలు నడపాలన్నారు. సిగ్నల్ జంప్ చేయడం నేరం, ప్రాణాంతకమైనదన్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని, అందుకు తగినట్లు వాహనాలు నడపాలని సూచించారు. భారీ వాహనాలకు దగ్గరగా చిన్న వాహనాలు వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాహిత ప్రభుత్వమిది



92వ వార్డు వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు



63వ వార్డు వైద్య శిబిరంలో కేస్ షీట్ అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కలిదిండి బద్రీనాథ్

- ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ప్రజా శ్రేయస్సుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 92వ వార్డు వెంకటాపురంలోని 460 సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన ఈ శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలను, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని నిత్యం సమీక్షించే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. దీని వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందని తెలిపారు. రోగులకు వైద్య నిపుణుల పర్యవేక్షణలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగించుకోవాలని కోరారు. ఆనంద్‌కుమార్ వెంట జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఉన్నారు. కార్యక్రమంలో బలిజ అభిరామ్, సత్యనారాయణ, అప్పలనాయుడు, లోకేష్ రెడ్డి, కంపర సత్తిబాబు, కోటేశ్వరరావు, దవల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే పరమావధి

సింధియా: ప్రజారోగ్యమే పరమావధిగా వైద్య సేవలందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశ ప్రజల మన్ననలు అందుకుంటోందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 63వ వార్డు క్రాంతినగర్ సచివాలయ పరిధిలో శనివారం పార్టీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్‌లు వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విధాలుగా కృషి చేస్తున్నారనన్నారు. అనేక వ్యాధులను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి చికిత్సకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరించేలా వైద్య విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం పొందేలా ప్రభుత్వం ఏర్పాట్లును చేసిందన్నారు. ప్రజల గడప వద్దకే ప్రభుత్వ వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలకు ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయా లని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు పరిధిలో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివా రం సంబంధిత అధికారులతో కలసి పరిశీలించా రు. ఎన్ఏడీ సెంటర్‌లో అంబేడ్కర్ నగర్ వైపు నిర్మి స్తున్న పబ్లిక్ టాయిలెట్స్ పనులతో పాటు కరాస వద్ద హిందూ-ముస్లిం- క్రైస్తవ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో చేపడుతున్న పార్కు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వార్డును మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీడీహెచ్ దామోదర్, హార్టికల్చర్ ఏఈ అర్చన, వర్క్ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, తదిరతులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అదీప్ రాజు, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో మంచినీటి రిజర్వాయర్ ట్యాంక్ ప్రహరీ పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి జీవీఎంసీ నిధులు రూ. 20 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. రహదారులు కాల్వలు, కమ్యూనిటీహాళ్ల మరమ్మతులు, గెడ్డల ఆధునికీకరణ వంటివాటికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామినాయుడు, యతిరాజుల నాగేశ్వరరావు, జగదీష్, వల్లి, శంకర్, రమణమ్మ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వంటశాలకు స్థలం వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న స్థలం ఇచ్చిన దాత,యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలోని శ్రీకృష్ణుడి ఆలయానికి వంటశాల నిమిత్తం చెల్లిబోయిన సత్యవతి సుమారు 60 గజాల తన సొంత స్థలాన్ని వితరణగా ఇచ్చారు. ఆ స్థలానికి చెందిన పత్రాలను శనివారం స్థానిక మురళీకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు, కృష్ణాలయం కమిటీ ప్రతినిధులకు అందించారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు వంటశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కృష్ణుడిపై ఉన్న భక్తితో చెల్లిబోయిన సత్యవతి తన సొంత స్థలం విరాళం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కర్రి దుర్గారావు, ఉరుకూటి చిన్నారావు, నీలాతి అప్పలరాజు,ఉరుకూటి సూర్యప్రకాష్‌లతో పాటు వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్



ట్రోఫీ అందిస్తున్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో టీమ్ చాంపియన్ షిప్‌ను హైదరాబాద్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబొరేటరీ గెలుచుకుంది. ఈ టోర్నమెంట్‌లో డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ పరిధిలోని 7 లేబొరేటరీల నుంచి 9జట్లు పాల్గొన్నాయి. 102 మంది క్రీడాకారులు తమ ఆటను ప్రదర్శించారు. రన్నరప్‌గా హైదరాబాద్‌కు చెందిన రీసెర్చ్‌సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)నిలిచింది. విశాఖ టేబెల్ టెన్నిస్ అసోసియేన్, జిల్లా టీటీ అసోసియేషన్, ఏపీ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ సహకారంతో టోర్నమెంట్ నిర్వహించారు. విజేతల డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ వై. శ్రీనివాసరావు, ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ ట్రోఫీలను అందించారు.

సేవా కార్యక్రమాలకు కారు అందజేత

మల్కాపురం: సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు చేస్తున్న సేవలను గుర్తించి ఆయన ట్రస్టుకు ఓ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కారు వితరణగా ఇచ్చారు. మల్కాపురం వద్ద శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అట్టా శివశంకర్ తన కారును సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావుకు తన సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. తమ ట్రస్టుపై ఉన్న నమ్మకంతో శివశంకర్ ఇచ్చిన కారును దివ్యాంగులు,మానసికరోగులను ఆస్పత్రికి తరలించేందుకు వినియోగిస్తానని వివరించారు.

గుడివాడ అప్పన్న కాలనీ సమస్యలపై వినతి



కార్పొరేటర్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ కమిటీ సభ్యులు శనివారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావుకు వినతి పత్రం సమర్పించారు. కాలనీలో మంచినీటికి ఇబ్బంది పడుతున్నామని, డ్రైనేజీ సమస్య కూడా అధికంగా ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వార్డును అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు పనులు చేపట్టామన్నారు. మిగిలిన పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వార్డులో అధికశాతం కొండవాలు ప్రాంతాలు కావడం వల్ల టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, దీంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ఆలస్యమవుతుందన్నారు. విషయాన్ని పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకవెళ్లామని, త్వరలోనే సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విమ్స్‌లో సిద్ధమవుతున్న సెంట్రల్ డ్రగ్స్ స్టోరేజీ



విమ్స్‌లో నిర్మాణంలో ఉన్న సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ భవనం

ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సెంట్రల్ డ్రగ్స్ స్టోరేజ్, సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ భవనం సిద్ధమవుతోంది. సుమారు రెండేళ్ల క్రితం విమ్స్ ఆవరణలో దీని నిర్మాణం ప్రారంభించారు. అప్పటి నుంచి జరగుతున్న నిర్మాణ పనులు కొద్ది రోజులుగా వేగం పుంజుకున్నాయి. ఇటీవల వైద్య విభాగం అధికారులు ఈ నిర్మాణంపై దృష్టి పెట్టారు. తొందరగా పనులు జరిపించి వినియోగంలోకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నారు. అరెకరం స్థలంలో ఈ నిర్మాణం చేపట్టారు. దీనికి రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం భవనానికి రంగులు వేస్తున్నారు. అన్ని పనులు పూర్తయిన వెంటనే కొద్ది రోజుల్లో దీన్ని వినియోగంలోకి తీసుకురానున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

పారదర్శకతతోనే ఆర్ట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్




వేడుకలో ప్రసంగిస్తున్న ఐఐఎం విశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్

ఉక్కునగరం: అకౌంటబిలిటీ, రెస్పాన్సిబిలిటీ, పారదర్శకత పైనే ఆర్ట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ ఆధారపడి ఉందని ఐఐఎం విశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం జరిగిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిధిగా ప్రసంగించారు. మనిషి గుండే తన మనస్సాక్షికి మూలాధారమన్నారు. నైతికత, నీతిధర్మాలను, విలువలు మనిషిని ఉత్తమంగా నడిపిస్తాయన్నారు. స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ అవినీతి అరికట్టడంలో డిజిటలైజేషన్‌ను విస్తృతంగా అనుసరించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కరుణరాజు మాట్లాడుతూ అవినీతి నిరోధక సంస్థలు చెక్ పాయింట్లుగా వ్యవహరించి అన్ని రకాల అవినీతి పద్ధతులకు నిరోధకంగా పనిచేస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్లు ఎ.కె. బాగ్చీ, ఎస్.పి. పాండే, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తర్ మహ్మద్ హనీఫ్ పాల్గొన్నారు.

8న ఉక్కు దీక్షకు మాజీ ఉప కులపతుల మద్దతు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ దీక్షకు మాజీ ఉప కులపతులు ఈనెల 8న మద్దతు ప్రకటించనున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ తెలిపారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఈనెల 8కు 1000వ రోజుకు చేరుకుంటున్నాయన్నారు. ఆ రోజు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఆ రోజు అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ హెచ్. లాలా లజపతిరాయ్, నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి డాక్టర్ శ్యామ్ ప్రసాద్, రాయలసీమ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ జీవీ ప్రభాకర్, ఏయూ మాజీ వీసీ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు, విక్రం సింహపురి యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రొక్కం ప్రభాకర్‌లు సంఘీభావం తెలపనున్నారు. ఈ కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ కార్మికులు, అభిమానులు, సానుభూతిపరులు హాజరుకావాలని ఆయన కోరారు.

996వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు చేస్తున్న ఉద్యమంలో దేశంలోని ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 996వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో వివిధ సంస్థలకు చెందిన కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 10న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ బట్టు వీరబ్రహ్మం మృతిపై ఈ నెల 10న మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు విశాఖ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగలమ్మ వీధికి చెందిన బట్టు వీరబ్రహ్మం(78)ను చికిత్స నిమిత్తం 2023 మే 15న కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అదే రోజు చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. విశాఖ ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని తన కార్యాలయంలో ఆ రోజు 11 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని, వీరబ్రహ్మం మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆర్డీవో సూచించారు.

సంపత్ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ



అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకుడు శ్యామ్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, ఆళివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తన, నక్షత్ర హారతి నిర్వహించారు.

క్రికెట్ టీంకు ఏయూ విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ఏయూక్యాంపస్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అండర్-15 మహిళా క్రికెట్ జట్టుకు ఏయూ ఆంగ్ల మాధ్యమం విద్యార్థినులు పి.వి.ఎల్.ఎన్. పరిమళ, పి.జె. గాయిత్రి ఎంపికయ్యారు. వీరిద్దరు ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ సుధారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. క్రీడల్లో రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధిలో 'పశ్చిమ' ఆదర్శం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్ తదితరులు

మల్కాపురం: అభివృద్ధిలో పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తున్నామని ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు నెహ్రూనగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్లు, వీధి కాలువలు తదితర అభివృద్ధి పనులకు శనివారం ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు.ఆయన మాట్లాడుతూ సుమారు రూ.13 లక్షలతో ఈ ప్రాంతంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్న ట్లు వివరించారు. త్వరలో మరిన్ని పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ మూడు జిల్లా కో ఆర్డినేటర్ కలిదిండి బద్రీనాథ్, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్,ట్రేడ్ యూనియన్ ఇండస్ట్రియల్ ఏరియా అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

60వ వార్డులో..

అనంతరం 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ, బర్మాకాలనీ వద్ద రూ. 34 లక్షలతో సీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, జీవీఎల్ నరేష్, ఆడారి హరీష్,బిల్డర్ శ్రీను,మళ్ల ధనలత తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం



మొల్లి గణేష్‌కు సంఘీభావం తెలుపుతున్న వంశీకృష్ణ యాదవ్

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ మండలానికి చెందిన మొల్లి గణేష్ అనే యువకుడు విశాఖ నుంచి తిరుపతి వరకూ పాదయాత్ర ప్రారంభించారు. ఉక్కు సంకల్పంతో ఆయన చేపట్టిన యాత్రకు మండలంలోని సీతానగరానికి చెందిన, ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ఉక్కు కార్మికులు అన్నవరం వెళ్లి పాదయాత్ర చేస్తున్న మొల్లి గణేష్‌కు సంఘీభావం తెలిపారు. ఈ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.